# "తమరు ఇంద్రులూ, చంద్రులునూ!"

సులోచన

లోకంలో అనేక రకాలయిన మనుష్యులు అనేక రకాలయిన మనస్తత్వాలు కలిగివుండటం వాటినే వాళ్లు గొప్పగా, ఉన్నతంగా ఎంచుకొని వ్యవహరించటం - మనం చూస్తున్నదే. వాళ్ళలో కొంత మందికి తమ మనస్తత్వాల్లో ఎంతవరకు మంచి వున్నదీ, ఆత్మ విమర్శన చేసుకొని, తరచి తరచి చూసుకొని, దిద్దుబాట్లు సరిచేసుకొని నడవటం చాతకాదు. ఎదుటివాళ్ళ విమర్శలకు, పరిహాసాలకు గురికాకుండా, ఆ రకంలో ముఖ్యంగా చెప్పుకోవల్సినవాళ్లు పొగడ్తలకు పొంగే ప్రజలు. వాళ్ళకొక ఆశయముంటూ వుంటుంది. ఎంత సేపటికీ తాము పరిసర ప్రజకన్న గొప్పవాళ్లు కావటమే. ఆధిక్యం వుండటమే. అదే వాళ్ళ ఆశయం. ఆ ఆశయాన్ని కేంద్రంగా పెట్టుకొని పని చేయటంవల్ల తామెంత నష్టపడుతున్నదీ, ఎంత ఒకళ్లక్రింద లోకువవుతున్నదీ వాళ్లు ఆలోచించరు. ఆలోచించాల్సిన అవసరం కనపడదు. ఎందుకు కనపడుతుందీ! తాము అందరిచాతా పొగడబడుతూ, ఆధిక్యాన్ని ఆర్జిస్తూంటే!

ఇలా ఒకళ్ళచేత పొగడబడుతూ, గర్వపడుతూ, గొప్ప చేసుకొంటూ, తృప్తిపడేది ఒక్క పురుషులే అనేందుకు అవకాశంలేదు. స్త్రీలను కూడా లెక్కించొచ్చు. వాళ్ళు తృప్తి పొందుతారు, గర్వపడతారు.

ప్రియురాల్ని పట్టుకొని ప్రియుడు ఓ వెన్నెల రాత్రి: 'నిజంగా నీవు దేవకన్యవు. లేకపోతే నీకీ సౌందర్యం ఎక్కణ్ణుంచి వస్తుంది' అంటే ఆమె పొందే ఆనందం, తృప్తి, గర్వం - యింత అని చెప్పటానికి వీల్లేదు. ఒక్కసారి ఒళ్లు గరిపొడచి, మొగ్గలుతొడిగి, ఇంకేమేమో అయి ప్రియుని ఒళ్లోకి దూకుతుంది. పాపం! ఆమెకు తెలీదు, తెల్సుకోలేదు ఈ ప్రియుడు కేవలం తననుండి ఏదో అధిక ఆనందాన్ని అనుభవించటానికి అబద్ధాలాడి, పొగిడి పొంగింపజేస్తున్నాడని. అసలు ఆ ఆలోచనకి ఎలా వస్తుంది? రాగలుగుతుంది? ఆమెకు అంతకుముందు తెలుసు: తను అందమైనదాన్ని కాదని, తనకంటె అందమైనవాళ్లు లెక్కకు మించివున్నారని, వాళ్ల క్రింద తనెంతని. కాని ప్రియుడు పొగిడిం తరువాత ఆ అభిప్రాయాన్ని ఎలా స్థిరపర్చుకోగలుగుతుంది? అది ఆమె దౌర్బల్యమే అవుతుంది. వస్తుతః సౌందర్యం లేనిది, ప్రియుడు పొగిడినంత మాత్రంచాత ఎక్కడనుంచి వస్తుంది? అనేది ఆమె తెల్సుకోగలగాలి. అప్పుడు ప్రియుడు దేనికోసం తన్ను పొగిడిందీ, ఎంత స్వార్థం యిమిడివుందీ తెలుస్తుంది.

ఇక్కడ కేవలం కాకపోయినా ముఖ్యంగా పొగడ్తవల్లనే అతనికి ఆమె లభించిందని చెప్పొచ్చు. లేకపోతే 'నీవు రాక్షసివి, నల్లటి రాచ్ఛిప్పవి, అందంలేదు, చందంలేదు' అని అంటే లభిస్తుందా? అందులో నిజం వుండనీ.

మీరు కోమటింటికెళ్లి నిప్పుపెట్టె తెచ్చుకోటానికి బద్ధకించి ఒక పిల్లవాణ్ని పిలిచి తెమ్మంటారనుకోండి. వాడు తెస్తాడా? పనేమిరా వల్లగాదంటాడు. పనుందంటాడు. వీలుగాదంటాడు. అప్పుడు మీకు వాణ్ని ఏమంటానికీ అవకాశం చిక్కదు. అలా అవకుండా ముందుగా వాణ్ని 'నీవు మంచివాడివిరా! రామకోటి కొడుకువుగదూ, అసలు మీ వంశమే మంచిదిరా, నీకుమాదిరిగా చెప్పగానే పనిచేసే పిల్లలు మనవూళ్ళో కాదుగదా ఎక్కడా లేరు' అని పొగిడితే వాడు వెళ్ళనంటాడా? క్షణంలో వెళ్ళి క్షణంలో వస్తాడు.

ఇప్పుడు ఇక్కడ పొగిడేవాళ్లు, పొగడబడేవాళ్లు- రెండు రకాలవాళ్లూ ఒకవిధమైన తృప్తీ, గర్వంపడతారు. తాము రెండు మాటలు చెప్పి పనినెరవేర్చుకొన్నామని పొగిడేవాళ్లు, ఫలానా వాళ్లు తమని పొగిడి పెద్దచేశారని పొగడబడే వాళ్లు తృప్తి, గర్వం పొందుతారు. కాని లాభిం

చేది మొదటి రకంవాళ్ళకే. ఇక ఈ పొగిడే వాళ్ళలో రెండు రకాలు: కొంతమంది అవసరం నెరవేరటానికి ముందు పొగుడుతారు, మరికొంతమంది అవసరం తీరాక పొగుడుతారు. ఇది వ్యక్తినిబట్టి జరుగుతుంది. వ్యక్తి బాగా ఎరుకలేనివాడై, సహృదయుడు కానివాడై, గడుసరివాడైతే ముందుగా బాగా పొగిడితేగాని లొంగడు. ఇక ఎరిగినవాడైతే, చెప్పగానే పని చేసి పొగడబడతాడు.

పొగడ్త అనే ముసుగులో ఇంకా జరిగే కొన్ని సంఘటనలు చూడండి:

పంతులు ఒక విద్యార్థిని ఏరుకొని 'వాడు భలే తెలివిగలవాడుగా, జ్ఞానంతటిలోకి వాడే మెరుగు. తారాజువ్వ. విధవలికి వాణ్ణి చూసినా బుద్ధిరాదు! ఈడుకు మించిన తెలివి, వినయం. ఒకటేమిటి సర్వసంకలితం—' అని పొగిడితే ఆ విద్యార్థి ఆ పంతులుకు పచ్చిమిరపకాయల దగ్గర్నుంచి దోసకాయల వరకూ కూరగాయలు యిస్తూ, అన్నిపనులూ చేసిపెడుతూ తోకవెంట తిరుగుతాడు, సేవకుడిమల్లే.

ఆ విద్యార్థి తనని పిల్లలు సన్యాసివెధవని, తిట్టేది మర్చిపోతాడు. ఒక్క పంతులు పొగడటంతోటే తను గొప్పవాణ్ణయ్యానని పొంగిపోతాడు. ఏదైనా చేసిపెట్టటానికి జంకడు. అందువల్ల తను కొన్ని పనులు చెడగొట్టుకొంటున్నాడనేది వాడు మరిచిపోతాడు.

ఈ పొగడ్తలకు పొంగటమనేది చిన్నపిల్లల్లో కూడా బలంగానే వుంది. అయితే ఒకటి, అందువల్ల వాళ్ళు నష్టపడేది, ఏమీ లేదు. వాళ్ళకే మేలును చేకూరుస్తుంది—

తల్లి తలదువ్వి, బొట్టుపెట్టి చద్ది తినిపించి, ముద్దుపెట్టుకొని- 'మావాడు రోజూ బళ్ళోకి వెళ్ళి చక్కగా చదివి అన్ని పరీక్షలూ ప్యాసవుతాడు. ఏం! బాబూ, ప్యాసుకావూ, అవుతావు! రోజూ బళ్ళోకి వెళితే కాకేంజేస్తావు తప్పకుండా కలక్టరీ ఉద్యోగం వస్తుంది! ఏం, బళ్ళోకి వెళతావు కదూ!' అని అనగానే వాడు బళ్ళోకి పరుగెత్తుతాడు. అందువల్ల ఆ రకం వాళ్ళకి నష్టం కాదు. అప్పుడు రెండు రకాల వాళ్ళకు అంతరంగానూ, బాహ్యంగానూ లాభం కనపడుతుంది.

ఈ పొగిడేవాళ్ళల్లో కొంతమంది లాభం కోసం పొగుడుతారు. తమకు లాభం లభించక పోయినా అనవసరంగా గొప్ప జేస్తారు కొంతమంది. 'మీరు చాలా గొప్పవారండి! ఒకళ్ళను పల్లెత్తు మాట అనరూ, పడరూ. అటువంటి ఉదారుడు, ఉదాత్తుడు దొరుకుతాడా!' ఆ మాటలకు పొగడబడేవాడు లొంగడు. అదంతా నిజంగాబట్టే. లేని ఆధిక్యతను కొని తెచ్చి పెట్టినప్పుడే పొగడ్తలకు పొంగేది.

ఒక్కొక్కప్పుడు ఈ పొగిడేవాళ్ళు దెబ్బ తింటారు ఎదుటివాడు తెలివి గలవాడైతే-

పొగిడిందంతా విని, 'అబ్బో ఈ భట్రాజు పొగడ్తల కేమొచ్చిందిలే,' అని పొగడబడేవాడంటే వాడు తలకాయ వంచుకొని, చిన్నబుచ్చుకొని మళ్ళా వాడిదగ్గర చస్తే అలా పొగడడు. ఇలా దెబ్బ తినిపించాలంటే పొగడబడేవాడు తెలివిగలవాడై వుండాలి. కొంతమంది ఒఠి పొగడ్తని తెలిసే పనిచేసిపెడుతూవుంటారు.

ఈ పొగడ్తలవల్ల ఎన్నెన్నో పనులు నెరవేరుతాయి - పొరుగింటాబిడ, ఎదురింటాబిడ దగ్గర కొచ్చి - 'సీతమ్మ పిన్ని! నీవు నమ్ముతావో లేవో గాని ఆ సుబ్బమ్మ వుంది చూశావూ, ఒఠిపీనాశి ముండ! వెళ్ళేటప్పుడు అంతా కట్టుకుపోతుంది గాబోలు. అయ్యో! అసలు నాదేబుద్ధి తక్కువయింది! ప్రక్కింటి ముత్తయిదువుగదా కాస్త మజ్జిగబోస్తుందని పోతే, వాకిట్లో వుండే లేదంది. అప్పుడు దాని మొఖాన 'నీవుపోయకపోతే ఇక పోసేవాళ్ళు లేరనుకున్నావా! మా సీతమ్మ పిన్ని వుంది, అడగనుగూడా అడిగించుకోదు, ఆ మహాతల్లిని చూసైనా మీకు బుద్ధిరాదు' అని అనొచ్చాను' అని ముంత చేతికిస్తే ఆమె మజ్జిగపొయ్యకుండా వుండ గలుగుతుందా?

ఇలాంటివే చాలా.

పొగిడేవాళ్ళు కేవలం స్వార్థంకోసం. తమ పనులు నెరవేరేకోసం పొగుడుతారనేది తెలుసుకోవటం ముఖ్యం; పొగడబడే వాళ్ళకి అప్పుడు పొంగి, ఉప్పొంగకుండా నిజాన్ని తెలుసుకొని చలోక్తిగా తప్పించుకోవచ్చు.